అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యం..

- మాట తప్పని నేత జగనన్న
- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్
- రాజాం పట్టణంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ


వైఎస్సార్ ఆసరా చెక్కును అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

రాజాం: రాష్ట్రంలో అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మెప్మా పరిధిలోని మహిళా సంఘాల సభ్యులకు శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో వైఎస్సార్ ఆసరా మూడోవిడత చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు ఆసరా నగదు అందజేస్తున్నారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో అక్కచెల్లెమ్మలను మోసం చేశాడని ఆరోపించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో కూడా జగనన్నను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు మూడు విడతల్లో ఆసరా అందజేశారని, 2024 జనవరిలో నాలుగో విడత సాయం అందజేస్తారని చెప్పారు.

బాబు వస్తే సంక్షేమానికి తూట్లు..

ఎన్నికలకు ముందు టీడీపీ నేత చంద్రబాబు ప్రజలను పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తారని, ఆయన అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలుండవన్న విషయం ప్రజలు గ్రహించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మహిళాభివృద్ధికి కృషి చేస్తున్న జగనన్నను మరోసారి గెలిపించుకోవాలన్నారు.

మూడు విడతల్లో రూ. 14.52 కోట్లు..

మెప్మా పరిధిలోని డ్వాక్రా సంఘ సభ్యులకు మూడు విడతల్లో రూ. 14.52 కోట్లు చెల్లించినట్లు ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, లింకేజీ రుణాలు, వైఎస్సార్ సున్నావడ్డీ, అమ్మఒడి, జగనన్న ఇళ్లు వంటి పథకాలు మహిళలకు ఉపయోగ పడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, వంజరాపు విజయ్‌కుమార్, దూబ గోపాలం, కలమట శంకర్, వెంపల లక్ష్మణరావు, పాలవలస గోపి, గొర్లె నారాయణరావు, కోల్లా రమ్య, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ బొల్ల లలితకుమారి, అల్లెన జయలక్ష్మి, టీఎంసీ రత్నం పాల్గొన్నారు.


పాల్గొన్న మహిళలు

మూడు విడతలు అందింది..



గత రెండు విడతలతో పాటు మూడో విడత కూడా ఆసరా సాయం అందింది. ఒక్కో విడతలో 11,600 రూపాయలు వచ్చింది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాలాంటి వారికి బాగా సహాయం చేస్తున్నారు. – పూడి సరస్వతి, మెహర్‌బాబు మహిళా సంఘం, కొండంపేట, రాజాం

జగనన్నను మరచిపోలేం..



మాకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మరిచిపోలేం. రెండు పర్యాయాలుగా మాకు ప్రతి ఏడాదీ రూ. 9,700ల వడ్డీ మాఫీ అందింది. ఈ ఏడాది కూడా 9,700 రూపాయలు జమైంది. – బి.చిన్నమ్మడు, శ్రీవరలక్ష్మి స్వయంశక్తి సంఘం, మెంతిపేటకాలనీ

మళ్లీ సీఎంను చేస్తాం..



ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారు. డ్వాక్రా సంఘాల్లోని అక్కచెల్లెమ్మల వడ్డీని నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని చెప్పి మూడు విడతలుగా మాఫీ చేశారు. జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపిస్తాం.– అంటిబోయిన లక్ష్మి, గణేష్ మహిళా సంఘం, యాతవీధి, రాజాం

మహిళాభ్యున్నతికి సీఎం జగన్ పెద్దపీట

- అక్కా చెల్లెమ్మల ఆర్థిక పరిపుష్టికి సహకారం
- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి


వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: మహిళాభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మూడో విడత ఆసరా పథకం కింద జిల్లాలో దాదాపు రూ.754 కోట్లు మహిళల ఖాతాలకు జమ చేశారన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి తిరుగులేని నాయకుడిగా ఎదిగారన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. నిత్యం మన బాగోగులు గురించి ఆలోచించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి అధికారంలోకి రావాలని ఆశీర్వదించాలని కోరారు. తొలుత వెలుగు, ఐసీడీఎస్ అంగన్‌వాడీల నేతృత్వంలో చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను తిలకించి రుచి చూశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ ఎంపీపీలు బెల్లాన ప్రసాద్, పెంకి అరుణ, మండల జేసీఎస్ చైర్మన్ చింతల సింహాచలం నాయుడు, ఎంపీడీఓ రమామణి, తహసీల్దార్ సాయికృష్ణ, వెలుగు శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేడుకగా సీతారామ పట్టాభిషేకం


మెయిన్‌రోడ్డు రామాలయంలో సీతారామ పట్టాభిషేకం

బాడంగి: మండల కేంద్రంలోని రామాలయంలో సీతారామ పట్టాభిషేక మహోత్సవం వేడుకగా శుక్రవారం జరిగింది. రామాలయ భక్త కమిటీ నూతన అధ్యక్షుడు గుడిపూరి శ్రీనివాసరావు, సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు రామేశ్వరశర్మ పట్టాభిషేకం నిర్వహించారు. వందలాదిగా భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని కోదండ రామాలయంలో అర్చకులు యడవల్లి శ్రీనివాసశర్మ సీతారాముల కల్యాణం నిర్వహించారు.

వైఎస్సార్ బీమా అందజేత


బీమా పరిహారం అందజేస్తున్న ఎంపీడీఓ శంకరరావు, తదితరులు

రాజాం సిటీ: మండల పరిధిలోని పెనుబాక గ్రామానికి చెందిన చీడి పద్మకు ఎంపీడీఓ బాసూరి శంకరరావు వైఎస్సార్ బీమా తక్షణ సాయం శుక్రవారం అందజేశారు. ఇటీవల ఆమె భర్త మృతి చెందడంతో తక్షణ సాయం కింద రూ. 10 వేలు అందజేశామన్నారు. మిగిలిన మొత్తాన్ని త్వరలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి బోడెమ్మ, కార్యదర్శి వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

మామిడితోట దగ్ధం


కాలిపోయిన మామిడి చెట్టును చూపిస్తున్న రైతు

రేగిడి: మండలంలోని వన్నలిలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో బెవర కాంతారావుకు చెందిన మామిడితోట అగ్నికి ఆహుతైంది. 50 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న ఈ మామిడితోట ప్రస్తుతం పూతదశలో ఉంది. ఎవరో సిగరెట్/బీడీ కాల్చిపడేయడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రూ. 50 వేల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని బాధిత రైతు లబోదిబోమంటున్నాడు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట


విద్యార్థికి వినికిడి యంత్రం అమర్చుతున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: దివ్యాంగుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక ఎంఆర్సీ భవనం ఆవరణలో దివ్యాంగ విద్యార్థులకు సమగ్రశిక్ష అభియాన్ ద్వారా మంజూరైన రూ.2 లక్షల విలువ చేసే ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు శుక్రవారం వారు పంపిణీ చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా 116 మంది విద్యార్థులకు మంజూరైన కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, ఎంపీడీఓ రమామణి, ఎంఈఓ తిరుమలప్రసాద్, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రకటనలు మానుకోవాలి


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి బబ్లు, తదితరులు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీలో ఉండబట్టే ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు టికెట్ కేటాయించడంతో కౌన్సిలర్ అయిన మరిశర్ల రామారావు తనకు సహకరించడం లేదని తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని 21వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి సంతోష్ తదితరులు అన్నారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ వార్డులోని నాయుడు కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో అభివృద్ధి ఇతర వార్డుల కన్నా ఎక్కువ జరిగిందన్నారు. రాజీనామా చేసేందుకు ఏదో కారణం ఉంటే చెప్పాలి తప్ప ఇలాంటి మాటలు ఆడటం సరికాదనీ, వైఎస్సార్ సీపీ ఆశీర్వాదం ఉంటే ఇక్కడ నీకన్నా అధిక మెజార్టీతో గెలుస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలు జగదీష్, యు వెంకట రమణ, సూర్యనారాయణ,భాషా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదముద్ర


కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బొబ్బిలి: మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు అజెండాలో రూపొందించిన పనులకు కౌన్సిలర్లంతా ఆమోదించారు. శుక్రవారం మున్సిపల్ సమావేశపు హాలులో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు గత సమావేశాన్ని ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించగా చివర్లో చెబుతామని చైర్మన్ సమాధానమిచ్చినపుడు టీడీపీ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల మధ్య కొద్ది సేపు వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం అజెండాను ఆమోదించాక కమిషనర్ శ్రీనివాసరావు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సమయంలో సభ్యుల అనుమతితో సమావేశాన్ని నిర్వహించలేదని వివరించారు.

మాకు లేని అన్యాయం మీకేం జరిగింది?

కౌన్సిల్ సమావేశంలో 21వ వార్డు కౌన్సిలర్ తనకు సహకరించకపోవడం వలన తాను వార్డు కౌన్సిలర్ పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించగా కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, కోట పెదరాములు మాకందరికీ జరగని అన్యాయం మీకేం జరిగిందని ప్రశ్నించారు. 21 వార్డు నాయుడు కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో గత 30 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి పనులు జరిగాయని చైర్మన్, కౌన్సిల్ సభ్యులు తిరిగి ప్రశ్నించారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఎగ్జిబిషన్


ఫుడ్ ఎగ్జిబిషన్ సందర్శిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, తదితరులు

రాజాం: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు శుక్రవారం ఏర్పాటు చేసిన ఫుడ్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. వైఎస్సార్ కిట్లు, బాలామృతం, చిరుధాన్యాలతో తయారుచేసిన పలు వంటకాలను ప్రదర్శించారు. ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ సభ్యుడు బండి నరసింహులు, వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, తదితరులు సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఏపీఎం దధికుమార్, సీడీపీఓ డాక్టర్ తోట కనకదుర్గ, ఏసీడీపీఓ సిమ్మాలమ్మ, సూపర్‌వైజర్లు సన్యాసమ్మ, సుజాత, జానకమ్మ, ప్రసన్న, నూకాలమ్మ, అమ్మన్నమ్మ, ఎంవీ రత్నం, కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సజావుగా సామాజిక తనిఖీల ప్రజావేదిక


ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌పీ

రేగిడి: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పనులకు సంబంధించిన ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సామాజిక తనిఖీల ఎస్‌ఆర్‌పీ సీహెచ్ చిరంజీవితో పాటు డీఆర్‌పీలు సత్తిరాజు, సత్తిబాబు, రాంబాబు తనిఖీల వివరాలు వెల్లడించారు. 15 రోజులుగా గ్రామాల్లో క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించడంతో పాటు ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామసభలు నిర్వహించామన్నారు. మండలంలో బ్లాక్ ప్లాంటేషన్ మొక్కలు పంపిణీ చేసిన వాటి కంటే తక్కువగా ఉన్నాయని, వర్క్‌సైట్ బోర్డులు కొన్నిచోట్ల కనిపించలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. వీటిని సరిచేసుకోవాలని ప్రొసీడింగ్ ఆఫీసర్ ఏపీడీ వీవీఎస్ లక్ష్మణరావును ఆదేశించారు. ఇదిలా ఉండగా మండలంలో 687 పనులకు సంబంధించి రూ. 19.57 కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు ఎస్‌ఆర్‌పీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ రాజు, ఏపీఓ హరనాథరావు, పలాస ఏపీఓ శంకరరావు, వివిధ శాఖల అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వేతనదారులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: భూగర్భ జలాలను పెంపొందించేందుగాను వర్షపు నీరు, వాడుక నీరు వృథాగా పోకుండా భూమిలోకి ఇంకిపోయేలా ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు అనే పథకం కింద లబ్ధిదార్లు నిర్మిస్తున్న ప్రతీ ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించేలా అవగాహన కల్పించాలన్నారు. ఇంకుడు గుంతలు నిర్మించడం ద్వారా భూగర్భ జలాలను అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

బిల్లాణిలో గ్రామసభ


వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌పీ దుర్గాప్రసాద్

సంతకవిటి: మండలంలోని బిల్లాణి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి పనులకు సంబంధించి గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేతనదారులకు కల్పించిన పనిదినాలు, చెల్లించిన వేతనాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఆర్‌పీ దుర్గాప్రసాద్, ఎంపీడీఓ రఘునాథాచారి, ఏపీఓ త్రినాథరావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ, హౌసింగ్ ఏఈ వెంకటేష్

తెర్లాం: జగనన్న ఇళ్ల లేఅవుట్‌లలో ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదార్లంతా సకాలంలో ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, మండల హౌసింగ్ ఏఈ ఎం.వెంకటేష్ కోరారు. తెర్లాంలోని జగనన్న ఇళ్ల లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాల స్థితిగతులు, బిల్లుల చెల్లింపులపై లబ్ధిదార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదార్లతో ఎంపీడీఓ, ఏఈ మాట్లాడుతూ స్థానిక జగనన్న ఇళ్ల లేఅవుట్‌లో 114 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా ఇంతవరకు 50కిపైగా శ్లాబులు పూర్తయ్యాయన్నారు. ఇళ్లు నిర్మించిన లబ్ధిదార్లందరికీ స్టేజ్‌ల వారీగా బిల్లుల చెల్లింపులు జరిగాయని తెలిపారు. వివిధ స్టేజ్‌లలో నిర్మాణ దశలో ఉన్న ఇళ్లన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని లబ్ధిదార్లను కోరారు. జగనన్న ఇళ్ల లేఅవుట్‌లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వారితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు ఉన్నారు.

సమావేశానికి హాజరుకావాలి

వంగర: రాజాంలోని సూర్యదుర్గా కల్యాణ మంటపంలో శనివారం నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి జేసీఎస్ కన్వీనర్ల సమావేశానికి గ్రామ కన్వీనర్లు హాజరుకావాలని మండల జేసీఎస్ కన్వీనర్ మరిశర్ల విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా గ్రామ కన్వీనర్లు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ప్రజా సేవలో నిర్లక్ష్యం వద్దు : ఆర్డీఓ


ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకుడు

మెంటాడ: ప్రజలకు రెవెన్యూ సేవలు అందించడంలో ఎటువంటి జాప్యం వహించినా ఉపేక్షించేది లేదని బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి ఆకస్మిక తనిఖీ నిమిత్తం శుక్రవారం వచ్చిన ఆమె విలేకర్లతో మాట్లాడారు. సమగ్ర భూసర్వేకు సంబంధించిన విరాలు అందించడంలో రెవెన్యూ సిబ్బందిలో అలసత్వం అధికంగా కనబడుతోందని చెప్పారు. దీన్ని గుర్తించే తనిఖీలకు వచ్చానన్నారు. ప్రజలకు సేవలు అందించడంలో రెవెన్యూ సిబ్బంది అలసత్వం స్పష్టంగా కనబడుతోందన్నారు.దీ నిపై సంబంధిత తహసీల్దార్‌తో మాట్లాడి సిబ్బంది పనితీరును మెరుగుపర్చేలా దృష్టి సారించడం జరుగుతుందన్నారు. మెంటాడ మండలానికి సంబంధించి రెవెన్యూ పరంగా ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం మండలంలోని గిరిజనులకు చెందిన భూములు పెత్తందారుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి రాకోటి రాములు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పేదల భూములతో పాటు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదని ఆమెకు ఫిర్యాదు చేశారు. తప్పకుండా దృష్టి సారించి ప్రభుత్వ భూములను కాపాడుకుంటామన్నారు. ఆమెతో పాటు పలువురు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే పేదలకు పథకాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

- జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమ పరిచయంలో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: గత ఎన్నికల ముందు శూన్యంగా ఉన్న రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు, అన్ని వర్గాల నాయకులకు పదవులు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు పరిచయ కార్యక్రమాన్ని నియోజకవర్గ స్థాయిలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు అనుసరించేలా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేయడం అందరికీ తెలుసన్నారు. వృద్ధాప్య పింఛను కోసం అర్హులను కలెక్టరేట్‌కు గతంలో తాను స్వయంగా తీసుకువెళ్లినప్పుడు తానేం చేయలేనని, జన్మభూమి కమిటీలదే పెద్దరికమని సాక్షాత్తూ కలెక్టరే చేతులెత్తేసిన పరిస్థితులు తాను స్వయంగా చూశానని తెలిపారు. మళ్లీ అలాంటి పెత్తందారీ వ్యవస్థలోకి వెళ్లకుండా ఉండాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ రావాలని ప్రజల హర్షధ్వానాల మధ్య అన్నారు. ఏప్రిల్ 14 వరకూ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యాచరణను ఆయన నాయకులకు వివరించారు. ఈ కార్యాచరణను నూటికి నూరు శాతం అమలు కావాల్సిందేనని రోజువారీ చేయాల్సిన షెడ్యూల్‌ను స్వయంగా చదివి వినిపించారు. ఏప్రిల్ 1–5 మధ్య మండల ఇన్‌చార్జి సచివాలయ కన్వీనర్లచే గృహ సారథులు, వలంటీర్లతో సచివాలయ వారీగా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఏప్రిల్ 3న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో సమీక్ష ఉంటుందన్నారు. ఏప్రిల్ 7న అందరూ పాల్గొనే డోర్ టు డోర్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, బుడా చైర్మన్ ఇంటి పార్వతి, పట్టణ మండల పార్టీ అధ్యక్షులు ఇంటి గోపాల రావు, శంబంగి వేణుగోపాలనాయుడు, పట్టణ, మండల జేసీఎస్ ఇన్‌చార్జిలు రేజేటి ఈశ్వరరావు, తమ్మిరెడ్డి దామోదరరావు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.